
నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 ఖమ్మం, గురువారం 26 సెప్టెంబర్ 2024 BHADRADRI KOTHAGUDEM

# ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు

## పండుగల వేళ ధరల పరేషాన్



- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- కేజీ వెల్లుల్లి రూ.400, కేజీ ఉల్లి రూ.70
- నూనెలు, పప్పు దినుసుల ధరలూ పైపైకే..
- 'దిగుమతి' చేసుకుంటున్న వ్యాపారులు





### కూరగాయల ధరలు మండిపోతున్నాయి..



మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. అన్ని కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏం కొనాలన్నా ధరలు కొండెక్కి కన్పిస్తున్నాయి. ఈ ఆరు నెలల్లోనే కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. రేట్లు ఇంతలా పెరగడంతో కూరగాయలు కొనలేకపోతున్నాం. కొన్నిసార్లు పచ్చళ్లతోనే వెళ్లదీయాల్సి వస్తోంది.

**–చింతపట్ల నాగలక్ష్మి, గృహిణి, ఖమ్మం**

### ఉల్లి ధర రూ.65పైనే ఉంది..



ఉల్లి లేకుండా ఏ కూరనూ చేయలేము. మార్కెట్లో ఉల్లి ధర రూ.65కి పైగా ఉంది. పెద్ద ఉల్లి గడ్డల ధర ఇంకా అంతకంటే ఎక్కువే చెబుతున్నారు. పెరిగిన ధరలతో ఉల్లిగడ్డలు కూడా కొనలేకపోతున్నాం. ఉల్లిగడ్డను సబ్సిడీపై అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రైతుబజార్‌ల ద్వారా తక్కువ ధరకు ఉల్లిగడ్డలు అందించాలి.

**– ఆవుల పుష్పమ్మ, గృహిణి, ఖమ్మం**



ఖమ్మం వీధి వ్యాపారుల ప్రాంగణంలో కూరగాయలు కొంటున్న నగర వాసులు

ఖమ్మం, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పండుగల సీజన్ వేళ కూరగాయల ధరలు పరేషాన్ చేస్తున్నాయి. 'ఏం కొనేటట్టులేదు.. ఏం తినేటట్టులేదు..' అన్నట్లుగా దాదాపు అన్ని కూరగాయల ధరలూ ఆకాశాన్నంటుతున్నాయి. ఉల్లి, వెల్లుల్లి ధరలైతే చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవలి వర్షాలకు ఉద్యాన పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతినడం, ఫలితంగా వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకోవాల్సి రావడం వంటివి ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. రూ.100 ఖర్చు చేస్తే ఒక్కరోజు కూడా సరిపడని పరిస్థితి. ఏటా కొత్త పంటలు చేతికొచ్చే సమయంలో కొంత మేరకు ధరలు పెరగడం సహజమే. అయినప్పటికీ నిరుటితో పోల్చుకుంటే ఈ ఏడాది ధరలు రెండు రెట్లు పెరిగాయి. సీజన్‌కు అనుగుణంగా ఒక రకం కూరగాయల ధరలు పెరిగితే.. మరో రకం కూరగాయల ధరలు తగ్గేవి. లేదా అదుపులో ఉండేవి. కానీ.. ప్రస్తుతం అన్ని రకాల కూరగాయలతోపాటు ఉల్లిగడ్డల ధరలు కూడా పెరిగిపోయాయి. దీంతో ధర ఎక్కువైనా తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఏ కూరను వండాలన్నా అందులో పచ్చి మిర్చి, టమాటా ఉండాల్సిందే. అయితే ఇప్పుడు వీటి ధరలు కూడా అమాంతం పెరిగాయి.

### హోల్‌సేల్ మార్కెట్లో ధరలు ఇలా..

ఖమ్మంలో మొత్తం నాలుగు రకాల మార్కెట్ సముదాయాలు ఉన్నాయి. వీటిలో మొదటిది హోల్‌సేల్ కూరగాయల మార్కెట్. దీనిలో ఏ రకం కూరగాయలు కొనాలన్నా కనీసం 10 కేజీలు కొనాల్సిందే. రెండోది రిటైల్ కూరగాయల మార్కెట్. దీనిలో కనీసం పట్టు(రెండున్నర కేజీలు) కొనాల్సి ఉంటుంది. మూడోది రైతుబజార్. ఇక్కడ పావు కేజీ నుంచి చిల్లరగా ఎన్ని కేజీల వరకైనా కొనుగోలు చేసుకోవచ్చు. ఇక నాలుగోది కాలనీల్లో బడ్డీ కొట్లు, నాలుగు చక్రాల బండ్లు. ఇక్కడ కూడా పావు కేజీ నుంచి ఎంతైనా కొనొచ్చు. ప్రస్తుత మార్కెట్లో కూరగాయల ధరలు రెండింతలు పెరిగి ఉన్నాయి.

### పోటీపడి పెరుగుతున్న ఉల్లి, వెల్లుల్లి ధరలు

ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలన్నీ నింగిని చూస్తున్నాయి. ఉల్లి, వెల్లుల్లి ధరలు మాత్రం పోటీపడి పెరుగెత్తుతున్నాయి. సాధారణంగా వెలుల్లి ధర కేజీకి రూ.200కు మించి ఉండదు. కానీ.. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.400కు పైబడి పలుకుతోంది. సాధారణంగా కేజీ ఉల్లి ధర కూడా రూ.20 నుంచి రూ.25 మధ్య ఉంటుంది. కానీ.. ప్రస్తుతం కేజీ రూ.70కి పైచిలుకే ఉంది. దీనికితోడు పప్పులు, మంచి నూనెల ధరలు కూడా పెరిగిపోయాయి. దీంతో పండుగల వేళ నిత్యావసర సరుకుల ధరలను చూసి సామాన్యులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా.. జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడమే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

**రైతుబజార్‌లో బుధవారం పలికిన ధరలు ఇలా ఉన్నాయి..**

| కూరగాయల రకం | కేజీ ధర |
|---|---|
| టమాటా | రూ.48 |
| పచ్చిమిర్చి | రూ.28 |
| దేశవాళీ చిక్కుడు | రూ.40 |
| గోరుచిక్కుడు | రూ.40 |
| క్యాబేజీ | రూ.26 |
| వంకాయ | రూ.36 |
| కాకరకాయ | రూ.40 |
| బీన్స్ | రూ.66 |
| క్యారెట్ | రూ.48 |
| బీట్‌రూట్ | రూ.34 |
| ఆలుగడ్డ | రూ.36 |
| చామగడ్డ | రూ.48 |
| బీరకాయ | రూ.48 |
| దోసకాయ | రూ.28 |
| దొండకాయ | రూ.34 |
| పొట్లకాయ | రూ.40 |
| బోడ కాకర | రూ.110 |
| సొరకాయ | రూ.36 |
| ములక్కాయ (ఒకటి) | రూ.15 |
| కీరదోస | రూ.36 |
| క్యాప్సికం | రూ.66 |
| ఉల్లిగడ్డ | రూ.70 |
| ఆకు కూరలు (3కట్టలు) | రూ.20 |
| కొత్తిమీర (కట్ట) | రూ.50 |

*అయితే, ఇవే కూరగాయల ధరలు రిటైల్ షాపులు, స్థానిక కిరాణా దుకాణాల్లో రెండు రెట్లు అధికంగా ఉంటాయి.*

**కూరగాయల సాగు ఇలా..**

| మండలం | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|
| కామేపల్లి | 95.20 |
| ఖమ్మం అర్బన్ | 18.23 |
| రఘునాథపాలెం | 71.35 |
| ఖమ్మం రూరల్ | 11.04 |
| కూసుమంచి | 11.31 |
| నేలకొండపల్లి | 6.12 |
| తిరుమలాయపాలెం | 19.35 |
| బోనకల్లు | 4.38 |
| చింతకాని | 42.15 |
| మధిర | 61.03 |
| ముదిగొండ | 34.03 |
| ఎర్రుపాలెం | 99.13 |
| కల్లూరు | 5. 11 |
| సత్తుపల్లి | 15.18 |
| తల్లాడ | 6.27 |
| వేంసూరు | 79.36 |
| ఏన్కూరు | 24.31 |
| కొణిజర్ల | 38.24 |
| సింగరేణి | 10.00 |
| వైరా | 8.04 |
| మొత్తం | 666.37 |

# ప్రజాక్షేత్రంలో ఉండి పనిచేయాలి

- పార్టీ శ్రేణులు ప్రజల కష్టసుఖాల్లో పాల్పంచుకోవాలి
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు
- మణుగూరులోని వంద బెడ్ల ఆసుపత్రి సందర్శన



జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 25 : ప్రజాక్షేత్రంలో ఉండి పనిచేస్తే ప్రతీ నాయకుడు, కార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు లభిస్తుందని భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. మణుగూరులో బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరైన రేగా.. తొలుత బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలాలు, గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ.. పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఆవేశంతో కాకుండా.. ఆలోచనతో పనిచేయాలని, ప్రభుత్వం చేస్తున్న తప్పులను గుర్తించి సంబంధిత శాఖల అధికారులను ప్రశ్నించాలన్నారు. బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే శ్రమించాలన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు తావివ్వొద్దని, ముఖ్యమైన అంశాలపై తనను సంప్రదించి పోస్టులు పెట్టాలని రేగా సూచించారు. అనంతరం మణుగూరు పట్టణంలోని 100 పడకల ఆస్పత్రిని సందర్శించిన రేగా వైద్యులతో కలిసి అన్ని వార్డులను కలియతిరిగారు. రోగులకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో మణుగూరు సొసైటీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, నాయకులు వట్టం రాంబాబు, కుంట లక్ష్మణ్, యాదగిరిగౌడ్, బొలిశెట్టి నవీన్, ముద్దంగుల కృష్ణ, కత్తి రాము, ఆవుల నర్సింహారావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు నాగెల్లి వెంకట్, పాకాల రమాదేవి, దారావత్ రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## వసతుల కోసం ప్రతిపాదనలు పంపండి..

### పెద్దాసుపత్రి వైద్యులకు ఖమ్మం కలెక్టర్ ఆదేశం



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ఖాన్

ఖమ్మం సిటీ, సెప్టెంబర్ 25 : పెద్దాసుపత్రిలో అవసరమైన పరికరాలు, సౌకర్యాలకు సంబంధించి ప్రతిపాదనలు త్వరగా రూపొందించి తనకు సమర్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని పెద్దాసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్యాజువాలిటీ, ఏఎంసీ, జనరల్ వార్డులు, వెయిటింగ్ హాల్, ఐసీయూ, ఫార్మసీ, మెడికల్ రూంలు, ఓపీ, ఫిజియోథెరపీ గదులను పరిశీలించారు. అక్కడి రోగులు, సహాయకులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులతో మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు. మందులు, ఇతర రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఆర్‌వోబీ నూతన ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్‌డీఎస్ కమిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఖాన్ ఆదేశించారు. కార్యక్రమంలో ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ కళావతిభాయి, డిప్యూటీ సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

### భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్

పాల్వంచ, సెప్టెంబర్ 25 : పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని, అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ, రోడ్లను శుభ్రం చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మాస్క్, గ్లౌజులు ధరించాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఐదుగురు పారిశుధ్య సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. అనంతరం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన కలెక్టర్.. త్వరలో ప్రారంభించనున్న డయాలసిస్ సెంటర్ పనులను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, డీసీహెచ్ఎస్ రవిబాబు, మున్సిపల్ కమిషనర్ ఢాకునాయక్, తహసీల్దార్ వివేక్ తదితరులు ఉన్నారు.

# పాడి రైతులపై విషం!

**పాడి రైతులపై కాంగ్రెస్ సర్కారు విషం జిమ్ముతున్నది. పశుసంపదను పెంచుతూ పాలను ఉత్పత్తి చేస్తున్న రైతులకు మోకాలడ్డుతున్నది. కేసీఆర్ సర్కారు హయాంలో ప్రతి పదిహేను రోజులకే పాలబిల్లులు వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రెండునెలలుగా పాలబిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 400 మంది పాడి రైతులు పాలను సేకరించి పాలకేంద్రానికి విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించిన పాలకు ప్రతి 15 రోజులకు బిల్లులు ఇవ్వాలి. బిల్లులు ఇస్తేనే వారు రైతులు వద్ద గ్రామాల్లో సేకరించిన పాలను పాలకేంద్రానికి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. రూ.10 లక్షల బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం వల్ల పాడిరైతులు 'విజయ డెయిరీ'కి పాలు పోయాలంటేనే జంకుతున్నారు.**

*– భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 25 (నమస్తే తెలంగాణ)*



- నెలల తరబడి బిల్లులు చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం
- ఆందోళనకు సిద్ధమైన పాల ఉత్పత్తిదారులు
- 'విజయ డెయిరీ'కి పాలు పోసేందుకు జంకుతున్న రైతులు
- సర్కార్ నిర్లక్ష్యంతో నానాటికీ తగ్గిపోతున్న పాల సేకరణ
- భద్రాద్రి జిల్లాలో 400 మందికి రూ.10 లక్షలపైనే బకాయిలు



పాలకేంద్రంలో పాలసేకరణ చేస్తున్న సిబ్బంది. లక్ష్మీదేవిపల్లి మండలంలో పాలసేకరణ చేసే పాలకేంద్రం ఇదే..

జిల్లాలో నాలుగు వేల మందికి పైగా రైతులు గేదెలు, ఆవులను సాదుకుంటున్నారు. కొంతమంది ఇంటి అవసరాలకు పశువులను పెంచుకుంటుంటే.. మరికొంతమంది స్థానికంగా పాలను విక్రయించి మిగిలిన పాలను పాలకేంద్రాలకు విక్రయిస్తున్నారు. పాలను సేకరణ చేసిన పాడిరైతులు నేరుగా కేంద్రానికి వెళ్లి పాలను సరఫరా చేస్తారు. ఇలా సరఫరా చేసిన పాలను పాలకేంద్రం అధికారులు 'విజయ డెయిరీ'కి పంపిస్తారు. ప్రతి పదిహేను రోజులకు పాలబిల్లులు ఆ రైతులకు ఇవ్వాల్సి ఉంటుంది. కాని ప్రస్తుతం దానికి భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదు. దీంతో రైతులు పాలసేకరణపై ఆసక్తి చూపడం లేదు.

### రూ.10 లక్షలకు పైగా బకాయిలు

జిల్లాలో ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం, చంద్రుగొండ, ములకలపల్లి, సుజాతనగర్ మండలాల నుంచి పాడిరైతులు పాలకేంద్రానికి పాలు పోస్తున్నారు. ఇప్పటివరకు రైతులందరికీ కలిసి రూ.10 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. రైతులు మాత్రం ఇంకా ఎక్కువ బిల్లులు రావాలని చెబుతున్నారు. ఒక్కో మండలం నుంచి రెండునెలలకు నాలుగుబిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు.

### రెండునెలలుగా బిల్లులు లేవు..



తెల్లవారుజామునే లేచి పాలను సేకరించి కేంద్రానికి పంపే మాకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్ పెట్టడం సరి కాదు. పాడిమీద బతికేటోళ్లం.. మేమెలా బతకాలి. కేసీఆర్ హయాంలో ప్రతి 15 రోజులకు బిల్లులు వచ్చేవి. రేవంత్ సర్కార్ వచ్చాక బిల్లులు రావడం లేదు. నాకు మొత్తం నాలుగు బిల్లులు రూ.1.60 లక్షలు రావాలి. కేంద్రానికి వెళ్లి అడిగితే ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదన్నారు. ఇలా అయితే పాలసేకరణ చేయలేం. చిన్న రైతులు నా వద్దకు వచ్చి పాలు పోస్తారు. ఆ పాలను నేను కేంద్రానికి పంపుతాను. వెన్నశాతం తగ్గించి రేటు నిర్ణయిస్తారు. దాని వల్ల రేటు తగ్గినా బిల్లులు సకాలంలో వస్తే ఇబ్బంది ఉండదు. నెలలు తరబడి బిల్లులు వాళ్ల వద్ద ఉంచుకుంటే పాడి రైతుల కష్టాలు ఎవరితో చెప్పుకోవాలి. ఇలాంటి పద్ధతి మంచిది కాదు.

**– కోటేశ్వరరావు, పాడి రైతు, సుజాతనగర్ మండలం**

### పాలసేకరణ కష్టంగా ఉంది..



రెండునెలల నుంచి బిల్లులు రావడం లేదు. ఊర్లో రైతుల వద్ద పాలను తీసుకుని పాలకేంద్రానికి పోస్తున్నాము. ఒక్కసారే సొమ్ములు వస్తాయనుకుంటే ప్రభుత్వం మొత్తానికే మోసం చేస్తున్నట్లు అనిపిస్తున్నది. రూ.50 వేల వరకు బిల్లులు రావాలి. బిల్లులు రాకపోవడం వల్ల పాలను కూడా తగ్గించాం. స్థానికంగా అమ్ముకోవాల్సి వస్తున్నది.

**– జజ్జూరి ఈశ్వర్, నర్సాపురం, ములకలపల్లి మండలం**

### లక్షా ఏభై వేలు రావాల్సి ఉంది..



నాకు రూ.లక్షా యాభై వేల బిల్లులు రావాల్సి ఉంది. రైతులందరం కలిసి ఆందోళన చేయాలని అనుకున్నాం. పాడిరైతులందరం ఒకతాటిపై ఉన్నాం. బిల్లుల కోసం ఆందోళనబాట పడుతున్నాం. లోకల్‌లో 50మంది రైతులు నాకు పాలు పోస్తున్నారు. అందరి తరపున ఒక్కరమే పాలు కేంద్రానికి పంపిస్తున్నాం. రైతులు డబ్బుల కోసం ఆగలేరు. గేదెల పోషణ చాలా ఇబ్బందిగా మారింది.

**– చామకూరి ప్రభాకర్‌రావు, జగన్నాథపురం, ములకలపల్లి**

# సాగర్ కాల్వకు 2,400 క్యూసెక్కుల నీరు

- రాత్రి కురిసిన వర్షంతో పాలేరుకు 5 వేల క్యూసెక్కుల వరద
- కాల్వ పనులు, నీటి విడుదలపై మంత్రి పొంగులేటి ఆరా



అండర్ టన్నెల్‌ను పూడ్చివేయడంతో నీటిని ఎత్తి కాలువలో పోస్తున్న 100 హెచ్‌పీ మోటర్లు

కూసుమంచి, సెప్టెంబర్ 25 : పాలేరు కాల్వ మరమ్మతులు పూర్తయిన తర్వాత ఇరిగేషన్ అధికారులు క్రమంగా నీటి ప్రవాహాన్ని పెంచుతున్నారు. బుధవారం సాయంత్రానికి సాగర్ ఆయకట్టుకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తోడు పాలేరు రిజర్వాయర్‌కు ఉదయం నుంచి క్రమంగా వరద పెరగడంతో బుధవారం సాయంత్రం వరకు 5 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. దీంతో రిజర్వాయర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. హట్యాతండా వద్ద ఉన్న యూటీ పూడ్చివేయడంతో కాల్వకు మరో పక్కన నీటి నిల్వలు లేకుండా మూడు 100 హెచ్‌పీ మోటర్లు ఏర్పాటు చేసిన వచ్చిన నీటిని వచ్చినట్లు మళ్లీ సాగర్ ప్రధాన కాల్వలోకి వదులుతున్నారు. పాలేరు రిజర్వాయర్‌కు ఈ నెల ఒకటో తేదీన వచ్చిన వరదలతో ఏర్పడిన గండి కారణంగా క్రమంగా 16 అడుగులకు చేరిన నీటిమట్టం.. వర్షంతో పెరుగుతూ సాయంత్రానికి 18.5 అడుగులకు చేరింది. గురువారం రాత్రి వరకు 20 అడుగుల వరకు నీటిమట్టం చేరే అవకాశం ఉంది.

### పనులపై మంత్రి పొంగులేటి ఆరా..

పాలేరు కాల్వ పనుల గురించి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రతి గంటకు కాల్వ లెవల్, బండ్‌పై పెంచుతున్న ఎత్తు, నీటి ప్రవాహం, యూటీ డీ వాటరింగ్‌పై ప్రత్యేకంగా ఆరా తీశారు. వర్షం కారణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పూర్తిగా నీటిని వదిలేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రి సీఈ విద్యాసాగర్‌ను ఆదేశించారు.

### భారీ వర్షంతో పనులకు ఆటంకం

హట్యాతండా వద్ద కాల్వకు పడిన గండి, యూటీ లీక్‌ను పూడ్చివేసి కాల్వ బండ్‌ను మట్టితో నింపుతున్న పనులకు భారీ వర్షంతో ఆటంకం కలిగింది. మట్టిని తరలించే ప్రాంతంలో నీరు నిలవడంతో తోలకానికి ఇబ్బందులు తలెత్తాయి. తిరిగి అధికారులు మధ్యాహ్నం నుంచి మళ్లీ మట్టి తోలకం పనులు చేపట్టారు.

### పనులను పరిశీలించిన సీఈ

కాల్వపై జరుగుతున్న పనులను సీఈ విద్యాసాగర్ బుధవారం పరిశీలించారు. మట్టి తోలకం, కాల్వలో నీటి ప్రవాహాన్ని దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈఈ అనన్య, డీఈ మధు, మరో ఈఈ మంగలపుడి వెంకటేశ్వర్లు, డీఈ మన్మధరావు పాల్గొన్నారు

# ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి




కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి భానుమతి

చుంచుపల్లి, సెప్టెంబర్ 25 : దివ్యాంగులు ఆత్మన్యూనతా భావాన్ని పక్కన పెట్టి ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే ఏ రంగంలోనైనా విజయం మీ సొంతం అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి అన్నారు. ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని బాబూ క్యాంప్‌లో గల భవిత సెంటర్‌లో మూగ, చెవిటి పిల్లలకు బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దివ్యాంగులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కొత్తగూడెంలోని పన్నాలాల్ టెక్స్‌లైట్స్ అధినేత సరంజన్‌కుమార్ అగర్వాల్ బధిరులకు వినికిడి మిషన్లను న్యాయమూర్తి చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా మోహన్, న్యాయవాదులు అడపాల పార్వతి, మెండు రాజమల్లు, ఎంఈవో జుంకీలాల్, డాక్టర్ బాలాజీ, శ్యాంసన్, నాగరాజు, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.